క్లుప్తంగా

విశ్రాంతి భవన నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: మండలంలోని రామేశ్వరంలో ఉన్న ఉత్తర రామేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో భక్తుల కోసం విశ్రాంత భవన నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, సర్పంచ్ సంపత్‌కుమార్, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, ఆశన్నగౌడ్, చంద్రశేఖర్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నందిగామలో ఈదురుగాలుల బీభత్సం



నందిగామలో కారుపై పడ్డ కటౌట్

నందిగామ: మండల కేంద్రం నందిగామ పరిసర గ్రామాల్లో గురువారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది. ఈదురుగాలులకు ఇటీవల నందిగామలో ఏర్పాటు చేసిన సోనియాగాంధీ కటౌట్ కూలిపోయి పక్కన్నే ఆపి ఉన్న కారుపై పడడంతో కారు స్వల్పంగా దెబ్బతింది. దీంతో పాటు అంబాపురం చెరువు కట్టపై ఏర్పాటు చేసిన టెంటు సైతం కూలిపోయింది.

సొంత నిధులతో షెడ్డు నిర్మాణం



షెడ్డును ప్రారంభిస్తున్న సర్పంచ్

కొత్తూరు: మండలంలోని పెంజర్ల సమీపంలోని నాగుల చెరువు వద్ద మహిళల కోసం సర్పంచ్ మామిడి వసుంధరమ్మ రూ.2లక్షల సొంత నిధులతో షెడ్డును నిర్మించారు. షెడ్డు నిర్మాణం పూర్తి కావడంతో నాయకులతో కలిసి షెడ్డును ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ.. బతుకమ్మ పండగ సమయంలో మహిళలకు ఇబ్బంది లేకుండా షెడ్డును నిర్మించినట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో గ్రామాభివృద్ధికి మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, ఎంపీటీసీ అంజమ్మ, రాధిక, గణేశ్, శారద, అమృత, సిద్దార్థరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత



ఆర్థిక సహాయం అందిస్తున్న గ్రామస్తులు

కేశంపేట: మండలంలోని బోధునంపల్లిలో ఇటీవల చాకలి నర్సింహ రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడిది నిరుపేద కుటుంబం కావడంతో దశదినకర్మ నిమిత్తం మృతుడి కుటుంబ సభ్యులకు గురువారం ఆర్థిక సాయం చేశారు. స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ విశాల శ్రావణ్‌రెడ్డి రూ.5వేలు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ లక్ష్మీనారాయణగౌడ్ రూ.5వేలు, లేమామిడి సర్పంచ్ శ్రీశైలంగౌడ్ రూ.3వేలు, పిప్పళ్ల శేఖర్ రూ.3వేలు, బీరప్ప రూ.3వేలు, సర్పంచ్ కళమ్మ రెండు వేలు, లావణ్య రెండు వేలు ఇచ్చారు. అలాగే, పలువురు నాయకులు 50 కిలోల చొప్పున్న బియ్యం అందజేశారు. కార్యక్రమంలో రమేష్ గౌడ్, శేఖర్, బీరప్ప, వెంకటయ్య, గోపమ్మ, చెన్నయ్య, సాయిలు, మల్లేష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం



ఇన్‌స్పెక్టర్ నరేష్‌ను బీజేపీ సన్మానిస్తున్న నాయకులు

శంకర్‌పల్లి: నూతనంగా ప్రారంభమైన మోకిల పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన నరేష్‌ను బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వడ్రీ తులసీరామ్ విజయ్‌కుమార్, రాములుగౌడ్, ప్రభాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రాజాచంద్ర, హరినాథ్, లింగం, సంజీవ్‌రెడ్డి, కృష్ణ తదితరులు ఉన్నారు.

ఘనంగా ఊరూరా చెరువుల పండుగ

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: కాకతీయుల కాలం నాటి చెరువుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం ఊరూరా చెరువుల పండుగ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని పీర్లగూడ, షాద్‌నగర్ శివారులోని బొబ్బిలి చెరువుల వద్ద నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. చెరువు కట్టలపై ముగ్గులు వేసి, తోరణాలతో అందంగా అలంకరించారు. అనంతరం కట్టమైసమ్మకు పూజలు, చెరువు నీటికి పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో బోనాలు, బతుకమ్మలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుతో పురాతన చెరువులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం మరమ్మతులు చేయించిందన్నారు. వర్షం నీటిని ఒడిసిపట్టేలా చెరువుల్లో పూడికతీయించడం జరిగిందని చెప్పారు. నియోజకవర్గంలో మొత్తం 460 చెరువులు ఉన్నాయని, నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో మిషన్ కాకతీయ పథకంలో భాగంగా విడతల వారీగా మరమ్మతులు చేయించడం జరిగిందని వివరించారు. చెరువుల పూర్వ వైభవం తీసుకురావడంతో మత్స్యకారులకు జీవనోపాధి కలుగుతుందని తెలిపారు. చెరువుల మరమ్మతుల ద్వారా నీటితో చెరువులు కళకళలాడుతున్నాయని, తద్వారా భూగర్భ జలాలు బాగా పెరిగి తాగు, సాగు నీటి సమస్య తీరిందని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజన్, ఎంపీపీ ఖాజా ఇద్రీస్ అహ్మద్, కమిషనర్ వెంకన్న, ఎంపీడీఓ వినయ్‌కుమార్, నాయకులు యుగేందర్, ప్రేమలత, ఈశ్వర్‌రాజు, నర్సింహ్మ, మహేశ్వరి, కృష్ణవేణి, మానస, లతాశ్రీ, శ్రీశైలంగౌడ్, వంకాయల నారాయణరెడ్డి, రుక్సానా బేగం, బుజ్జిబాబు నాయక్, హన్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చెరువుల పండుగ

నందిగామ: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం చెరువుల పండుగను నందిగామలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నందిగామ, నర్సప్పగూడ, అప్పారెడ్డిగూడ గ్రామాల్లోని చెరువుల వద్ద ఉన్న అమ్మవారికి ఊరేగింపుగా వెళ్లి గ్రామస్తులు బోనాలు సమర్పించారు. అనంతరం చెరువు కట్టలపై సహపంక్తి భోజనాలు చేశారు. ముఖ్యఅతిథిగా జెడ్పీవైస్ చైర్మన్ గణేశ్ హాజరై మాట్లాడారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువులను, కుంటలను మరమ్మతులు చేసుకొని వాటికి పూర్వవైభవం తెచ్చిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు. కార్యక్రమంలో సర్పంచులు వెంకట్ రెడ్డి, అశోక్, జేకే నర్సింహా, కుమార్, చేగూరు పీఏసీఎస్ చైర్మన్ అశోక్, తహసీల్దార్ రహ్మన్‌ఖాన్, ఎంపీడీఓ బాల్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్: బోనాల ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

భూగర్భ జలాలు పెరిగాయి

కొత్తూరు: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన మిషన్‌కాకతీయ పథకంతో చెరువులు జలకళను సంతరించుకున్నాయని జెడ్పీటీసీ ఎమ్మె శ్రీలత అన్నారు. మండలంలోని గూడూరు, కొత్తూరు మున్సిపాలిటీల్లో గురువారం నిర్వహించిన దశాబ్ది ఉత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. చెరువులకు పూజలు చేసి, దేవతలకు బోనాలతో నైవేద్యం సమర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉనికిని కోల్పోతున్న చెరువులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం మరమ్మతులు చేపట్టి ఊపిరి పోసిందన్నారు. సీఎం కేసీఆర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా వేల చెరువులకు మరమ్మతులు చేపట్టి సాగు, తాగు నీటికి లోటు లేకుండా చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, నాయకులు దేవేందర్‌యాదవ్, సత్యనారాయణ, ఆయా శాఖల అధికారులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

అభివృద్ధికి చిరునామా తెలంగాణ

కేశంపేట: రాష్ట్రాభివృద్ధి దేశానికే ఆదర్శమని, అభివృద్ధి అంటేనే కేసీఆర్ అని స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ విశాల అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం ఊరూరా చెరువుల పండుగ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని అల్వాల, భైర్కాన్‌పల్లి, లేమామిడి, ఎక్లాస్‌ఖాన్‌పేట, కాకునూర్, కొత్తపేట, నిర్దవెల్లి, దత్తాయపల్లి, ఇప్పలపల్లి, పాపిరెడ్డిగూడ, పోమాల్‌పల్లి, వేములనర్వ, కేశంపేట, సుందరపురం గ్రామాల్లో చెరువుల పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో బతుకమ్మలతో మహిళలు చెరువుల వద్దకు చేరుకొని ఆటపాటలతో అలరించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ అజీంఅలీ, ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, ఎంఈఓ మనోహర్,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



కొత్తూరు: బోనాలు ఎత్తుకున్న జెడ్పీటీసీ శ్రీలత, ఇతర మహిళలు

చెరువులకు జలకళను తీసుకువచ్చిన కేసీఆర్

కొందుర్గు: రాష్ట్రంలోని చెరువులకు జలకళను తీసుకువచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని జెడ్పీటీసీ స్వరూపరాములు అన్నారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం జిల్లేడ్‌చౌదరిగూడ మండలంలోని ఎదిర, పెద్ద ఎల్కిచర్ల, జిల్లేడ్ తదితర గ్రామాల్లో ఊరూరా చెరువు పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కట్టమైసమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొందుర్గులో: మండలంలోని తంగళ్లపల్లి, మహదేవ్‌పూర్, కొందుర్గు, విశ్వనాథ్‌పూర్ తదితర గ్రామాల్లో ఊరూర చెరువు పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని చెరువు కట్టలపై అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ జంగయ్య, వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, తహసీల్దార్ రమేష్‌కుమార్, ఎంపీడీఓ ఆంజనేయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చెరువుల కళకళలాడుతున్నాయి..

చేవెళ్ల: సీఎం కేసీఆర్ ఎంతో ముందు చూపుతో తీసుకువచ్చిన మిషన్ కాకతీయతో చెరువులు కళకళలాడుతున్నాయని జెడ్పీటీసీ మాలతి అన్నారు. మండల కేంద్రంలో గురువారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చేవెళ్లలోని వెంకటేశ్వరస్వామి పుష్కరిణి(గుండం) వద్ద అధికారులు, ప్రజాప్రతినిధులు బతుకమ్మ ఆటలు ఆడారు. బతుకమ్మలు ఆడుతూ వాటిని పుష్కరిణిలో వదిలారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చెరువుల పునరుద్ధరణతో నీటి పారుదల సాగు పెరిగిందన్నారు. రైతుల బోరుబావుల్లో పుష్కలంగా నీరు వచ్చిందని సంతోషంలో ఉన్నారని చెప్పారు. చేవెళ్ల నియోజకవర్గం కొత్తగా 5 చెక్ డ్యాంలు నిర్మించారు. 218 చెరువులు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజ్‌కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ రాజేశ్, డివిజన్ అటవీశాఖ అధికారిని ప్రతిమ, సర్పంచ్‌లు శైలజ, నరహరిరెడ్డి, జహంగీర్, ఎంపీఓ విఠల్వేశ్వర్‌జీ, ఏపీఎం శోభారాణి, బీఆర్‌ఎస్‌పార్టీ నాయకులు ప్రభకర్, కృష్ణ, ఫయాజ్, పూజారి శ్రీపాదు, గ్రామ కార్యదర్శులు, టీచర్లు, ఆశవర్కర్లు ఉన్నారు.

శంకర్‌పల్లిలో...

మండలంలోని ప్రొద్దటూరు చెరువు వద్ద గురువారం చెరువు పండుగ సంబరాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శంకర్‌పల్లి ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రంలోని గ్రామాలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని చెప్పారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాలతో ప్రజలకు ఎంతో ఉపయోగపడుతాయని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గోవిందమ్మ, తహసీల్దార్ నయీమొద్దీన్, ఎంపీడీఓ వెంకయ్య, ఏఎంసీ చైర్మన్ పాపారవు గ్రామస్తులు పాల్గొన్నారు.



కేశంపేట: చెరువు పండుగ కార్యక్రమంలో పాల్గొన్న విశాల



కొందుర్గు: బతుకమ్మలతో చెరువు వద్దకు చేరుకున్న మహిళలు, ప్రజాప్రతినిధులు, అధికారులు



చేవెళ్ల: పుష్కరిణి వద్ద బతుకమ్మలతో అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళలు

బాధితురాలికి న్యాయం చేయాల్సిందే



ఆర్డీఓ కార్యాలయానికి పాదయాత్రగా వస్తున్న నాయకులు

కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజు

షాద్‌నగర్‌రూరల్: వృద్ధురాలు వెంకటమ్మ భూమికి సంబంధించిన పొజిషన్ చూపే వరకు పోరాటం ఆగదని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గురుమిళ్ల రాజు అన్నారు. గురువారం పాదయాత్ర ద్వారా ఆర్డీఓ కార్యాలయానికి చేరుకొని అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. కేశంపేట మండలం, కాకునూరుకు చెందిన వెంకటమ్మ 20 గుంటల భూమికి పట్టా పాసు పుస్తకం, రైతుబంధు, పీఎం కిసాన్ డబ్బులు వస్తున్నాయని అన్నారు. భూమి ఎక్కడ ఉందో రెవెన్యూ అధికారులు పొజిషన్ చూపడం లేదని ఆరోపించారు. రెవెన్యూ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా భూమిని ఆక్రమణ దారుల నుంచి విడిపించడంలేదన్నారు. 12 ఏళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా బాధితురాలికి న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే న్యాయం చేయాలని లేకుండా ఆందోళన తీవ్ర తరం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులు మోహనకృష్ణ, రాణి, సావిత్రిబాయి పూలే మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సరోజ, కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి అఖిల భారత కన్వీనర్ లక్ష్మయ్య, నేతలు చిన్న, చక్రవర్తి, గోవింద్, లక్ష్మయ్య, కిష్టప్ప పాల్గొన్నారు.

దైవచింతన అలవర్చుకోవాలి

మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి

నందిగామ: ప్రతి ఒక్కరు దైవ చింతన అలవర్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని రంగాపూర్‌లో గురువారం నిర్వహించిన కోట మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. గ్రామ దేవతలైన మైసమ్మ, ఎల్లమ్మ, పోచమ్మలను అనాధిగా పూజించడం ఆనవాయితీ. అనంతరం ఆలయ అభివృద్ధికి లక్ష రూపాయలు విరాళంగా నిర్వాహకులకు అందజేశారు. అలాగే, పీసీసీ ప్రధాన కార్యదర్శ వీర్లపల్లి శంకర్ మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేశ్‌గౌడ్, నందిగామ పీఏసీఎస్ చైర్మన్ తోట రాజ్‌గోపాల్, ఉప సర్పంచ్ సుజాత, నాయకులు బాల్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, మహేందర్, రాఘవేందర్ పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

కంటివెలుగును సద్వినియోగం చేసుకోండి



కంటివెలుగును ప్రారంభిస్తున్న ఎంపీపీ ప్రియాంక, గణేశ్

ఎంపీపీ ప్రియాంక

నందిగామ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ప్రియాంక అన్నారు. గురువారం మండలంలోని రంగాపూర్‌లో స్థానిక సర్పంచ్ రమేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటివెలుగు కార్యక్రమం జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేశ్ కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ.. ప్రజలు కంటి సమస్యలతో బాధ పడొద్దనే ఉద్దేశంతో గ్రామగ్రామాన ప్రజల వద్దకే నిపుణులైన డాక్టర్ల బృందం వచ్చి ఉచితంగా చికిత్సలు నిర్వహిస్తున్నారని తెలిపారు. అవసరమైన వారికి ఆపరేషన్లు చేసి ఉచితంగా మందులు అందజేస్తారని చెప్పారు. అన్ని వర్గాలకు పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని వివరించారు. కార్యక్రమంలో నందిగామ పీఏసీఎస్ చైర్మన్ రాజ్‌గోపాల్, వైద్య సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మెగా లోక్ అదాలత్‌తో కేసులు పరిష్కారం

ఇన్‌స్పెక్టర్ రామయ్య

నందిగామ: ఈ నెల 10న షాద్‌నగర్ న్యాయస్థానంలో నిర్వహించనున్న మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌స్పెక్టర్ రామయ్య సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. రాజీమార్గమే రాజమార్గమని, నందిగామ పోలీస్ స్టేషన్‌లో నమోదైన చిన్న చిన్న తగదాలు , రోడ్డు ప్రమాదాల కేసులను ఇరువర్గాల వారు పరిష్కరించుకునేందుకు మెగా లోక్ అదాలత్ ఉపయోగపడుతుందని చెప్పారు.

రాబోయేది బీజేపీ ప్రభుత్వమే

బీజేపీ నాయకుడు విజయ్‌కుమార్



ప్రచారం నిర్వహిస్తున్న విజయ్‌కుమార్

షాబాద్: రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని నియోజకవర్గం బీజేపీ నాయకుడు వడ్రీ తులసిరామ్ విజయ్ కుమార్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని సోలీపేట్‌లో గడపగడపకూ బీజేపీ పర్యటించి కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, ఎన్నికలకు కేవలం నాలుగు నెలల సమయం మాత్రమే మిగిలి ఉందని తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతి కార్యకర్త గ్రౌండ్‌లెవల్‌లో కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. మోదీ తొమ్మిదేళ్ల పాలన విజయాలను ప్రజలోకి తీసుకెళ్లడానికి జన సంపర్క్ అభియాన్ కార్యక్రమానికి రూపొందించిన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు యాదిరెడ్డి, నాయకులు స్వామి, రమేష్‌యాదవ్, మమేందర్‌చారి, సురేందర్ తదితరులున్నారు.

జోరుగా చేపల అమ్మకం



చేపలు అమ్ముతున్న వ్యాపారులు

చేవెళ్ల: మృగశిర కార్తె సందర్భంగా గురువారం చేపలకు మంచి డిమాండ్ పలికింది. మండలకేంద్రంలో ప్రధాన రోడ్డుపక్కన ప్రత్యేకంగా చేపల దుకాణాలు వెలిశాయి. ఉదయం నుంచి ప్రజలు చేపల కొనుగోలు చేసేందుకు బారులు తీరారు. గురువారం సంత కావడంతో మండలంలోని చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో రావడంతో చేపల అమ్మకం జోరుగా సాగింది. కిలో రూ. 200లకు దొరికే చేపలు మృగశిర కార్తె కావడంతో 200లనుంచి రూ.600 వరకు చేపల రకాలను బట్టి అమ్మకాలు చేశారు.

నూతన పంచాయతీల ఘనత కేసీఆర్‌దే

జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేష్

నందిగామ: తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేశ్ అన్నారు. మండలంలోని చాకలిగుట్ట తండాలో సర్పంచ్ రాజునాయక్ ఆధ్వర్యంలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి గురువారం గణేశ్ ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా గిరిజనులు తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని ఆందోళనలు చేసినా ఏ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పల్లెలు, గుడేలు, తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా చేశారు. గ్రామ పంచాయతీలకు ప్రతి నెల నిధులు ఇస్తూ, పట్టణాలతో సమానంగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివ శంకర్ గౌడ్, వైస్ ఎంపీపీ మంజుల నాయక్, సర్పంచులు రాజు నాయక్, జెట్ట కుమార్, ఉప సర్పంచ్ మెక్కొండ కుమార్ గౌడ్, నాయకులు యాదగిరి,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న గణేశ్

లక్ష్మీదేవిపల్లిపై ప్రభుత్వాల నిర్లక్ష్యం



రిలేనిరాహార దీక్షలో మాట్లాడుతున్న లక్ష్మయ్య

- కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి ఆల్‌ఇండియా కన్వీనర్ లక్ష్మయ్య

షాద్‌నగర్‌రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం నిలిచిపోయిందని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి ఆల్ ఇండియా కన్వీనర్ లక్ష్మయ్య ఆరోపించారు. లక్ష్మీదేవిపల్లి నిర్మాణాన్ని చేపట్టాలని ప్రతి పక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం 7వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలకు ప్రజా సంఘాలు, బహుజన సంఘాల నేతలు మద్దతు తెలిపారు. లక్ష్మయ్య మాట్లాడుతూ.. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో మళ్లీ ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితులు రావడం పాలకులకు సిగ్గుచేటని విమర్శించారు. కోట్ల రూపాయల నిధులను వృథా చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణాన్ని ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించారు.కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు అర్జునప్ప, రవీంద్రనాథ్, తిరుమలయ్య, నర్సింలు, సరోజిని, రాజు, గోవిందు, మోహనకృష్ణ, చక్రవర్తి పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు

శాస్త్రవేత్తలు డాక్టర్ బ్రజేంద్ర, డాక్టర్ కుమార్

షాబాద్: రైతులు ప్రతి సంవత్సరం భూసార పరీక్షలు చేసుకోవాలని రాజేంద్రనగర్ వరి పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు డాక్టర్ బ్రజేంద్ర, డాక్టర్ కుమార్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని తిర్మలాపూర్, ముదెంగూడ, రేగడిదోస్వాడ, మిట్టకంకల్ గ్రామాల రైతులకు భారతీయ వరి పరిశోధన సంస్థ రాజేంద్రనగర్ వారి సహకారంతో సేవాస్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో భూసార పరీక్ష ఆవశ్యకతపై షెడ్యూల్ కులాల రైతులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నేలలో ఉండాల్సిన పోషకాలు సమపాళ్లలో ఉన్నప్పుడు పంటల సాగులో పెట్టి పెట్టుబడులు తగ్గి మంచి దిగుబడులు పొందే అవ కాశం ఉందన్నారు. రైతులు విధిగా నేల పరీక్షలు జరిపి పోషక లోపాలు సరిచేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతు స్థాయి లో ప్రధాన పోషకాలు నత్రజని, పోటాష్, భాస్వరం పరీక్ష చేసే విధానంపై శిక్షణ ఇచ్చారు. సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్ మాట్లాడుతూ.. జిల్లాలో తమ ఫౌండేషన్ ద్వారా రైతులకు చేస్తున్న సేవలు వివరించారు. రైతులకు నేలను సారవంతం చేయడానికి చేపట్టాల్సిన చర్యలు గురించి వివరించారు. పశువుల ఎరువు, పచ్చిరొట్ట పైర్లు వేసి భూమిలో కలియదున్నడం, జీవన ఎరువులు, పంట మార్పిడి, చెరువు మట్టి వంటివి రైతు లు తమ నేల సారవంతం చేయుటకు విధిగా పా టించడం వల్ల మొక్కలు ఆరోగ్యంగా పెరిగి ఆశించిన దిగుబడి పొందే అవకాశం ఉందని రైతులకు సూచించారు. మండల వ్యవసాయ అధికారి వెంకటేశం మాట్లాడుతూ.. రైతులకు పంటల సాగు విధానంలో అనుసరిచాల్సిన పద్ధతులు వివరించారు. సాంకేతిక నిపుణులు శ్రీకాంత్, శ్రీనివాస్ మాట్లాడుతూ.. మట్టినమూనా సేకరణ, పరీక్ష చేసే విధానం గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో రైతులు గోపాల్‌రెడ్డి, అంజయ్య, మహేందర్, నర్సింహులు, బాలయ్య, శంకర్, బందెయ్య, భాస్కర్ ఉన్నారు.



షాబాద్: అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు